క్లుప్తంగా

దారావారితోటలో చోరీ

ఒంగోలు సెంట్రల్: నగరంలోని దారావారితోటలో ఓ మహిళ నివాసంలో దొంగలు పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరుకు చెందిన మహిళ పింగిలి నిర్మల బస్టాండ్ సమీపంలోని టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తూ జీవిస్తోంది. దారావారితోటలో నివాసం ఉంటోంది. ఈ నెల 4న తన స్వగ్రామం నెల్లూరు వెళ్లింది. తిరిగి 6వ తేదీ ఇంటికి రాగా, తాళం పగులకొట్టి ఉంది. నివాసంలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. తన నివాసంలో దొంగలు పడినట్లు గుర్తించి స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను దాచుకున్న వెండిపట్టీలు, బంగారు కమ్మలు, సుమారు రెండు వేల రూపాయల నగదు పోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు బాలరాజు, కామేశ్వరశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ కార్తీక్ భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాట్లు చేశారు.


ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామికి పూజలు


నాగేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


పుట్టకి పసుపు, కుంకుమలతో పూజలు చేస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం ఆషాడ మాసం ఆదివారం స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు సుబ్రహ్మణ్య స్వామి మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలు పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు, పాలు, పెరుగు, తేనె, చక్కెర, వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృతాల అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ గావించి అష్టోత్తర శతనామావళి పూజ క్రతువులను జరిపి స్వామివారికి కర్పూర హారతితో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవస్థానం వెలుపల ఉన్న నాగేంద్రస్వామి పుట్టకి, జంట నాగేంద్రులకు మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామికి ప్రీతికరమైన మాసం ఆషాడం ఆదివారం కావడంతో మహిళా భక్తులు ఉదయం ఆరు గంటలకు జంట నాగేంద్రుల విగ్రహాలకు పసుపు, కుంకుమలతో అలంకరణ గావించి పుట్టలో పాలు పోశారు. చలివిడి ధూప దీప హారతులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నాగేంద్రస్వామి మొక్కులు తీర్చుకున్నారు.

24 నుంచి నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు


కొత్తపట్నంలోని నాంచారమ్మ తల్లి

కొత్తపట్నం: స్వస్తిశ్రీ శ్రీ క్రోధినామ సంవత్సర జేష్ఠ శుద్ధ చతుర్థి ఈ నెల 24వ తేదీ శతభిషా నక్షత్రయుక్త కన్యాలగ్న పుష్కరాంశ సుముహూర్తమున కొత్తపట్నంలోని శ్రీ నాంచారమ్మ తల్లి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వంశపారంపర్య ధర్మకర్త గౌరవరపు కోటయ్య, కమిటీ సభ్యులు తెలిపారు. 29వ తేదీతో ముగుస్తాయన్నారు. ఐదేళ్లకు ఒకసారి ఈ బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయన్నారు. ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేక అలంకరణతో గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24న కలశ స్థాపన, కుంకుమ పూజ, రాత్రికి పులివాహనంపై గ్రామోత్సవం, ఆలయ ప్రాంగణంలో కొత్తపట్నం శంభునిరెడ్డిపాలెం వారిచే బొబ్బిలి రాయుడు సాంఘిక నాటకం, భారీ మందు చెట్లు కాల్చడం జరుగుతుందన్నారు. 25న పగలు సింహవాహనంపై శ్రీ నాంచారమ్మ తల్లి గ్రామోత్సవం, రాత్రికి కొత్తపట్నం శంభునిరెడ్డి పాలెం వారిచే పులిబిడ్డలు సాంఘిక నాటకం ప్రదర్శనలు ఉంటాయన్నారు. 26న పగలు గజవ్యాళి వాహనంపై, రాత్రి చిన్న ఏనుగు వాహనంపై శ్రీ నాంచారమ్మతల్లి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. అదేరోజు మూడు భారీ విద్యుత్ ప్రభలు, రాక్‌స్టార్ ఈవెంట్స్, ఒంగోలు వారి గొప్ప డ్యాన్స్ ప్రదర్శన, స్వరసుమాంజలి ఒంగోలు వారిచే గొప్ప పాటకచేరి, చింతామణి నాటకం ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. 27న పగలు గుర్రం వాహనంపై, రాత్రికి పెద్ద ఏనుగు వాహనంపై శ్రీ నాంచారమ్మ తల్లికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. రేణుకా యుద్ధం, మూడు భారీ విద్యుత్ ప్రభలు, ఎల్ఈడీ ప్రభలు, జయశ్రీ ఈవెంట్స్ డ్యాన్స్ ప్రదర్శన, రాత్రి 10 గంటలకు 200 మందు చెట్లతో బాణసంచా పేల్చి పోటీలో గెలిపొందిన వారికి రూ.50 వేల నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 28న పొంగళ్లు, పసుపు బండ్లు, శిరిమానోత్సవం, రాత్రికి స్నేహం కోసం సాంఘిక నాటకం ప్రదర్శనలు ఉంటాయన్నారు. 29న పగలు చివరి రోజు శ్రీ గంగాదేవి అమ్మవారికి కల్లి పాటు జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా పవని పరమేశ్వరరావు జయంతి


పరమేశ్వరరావు జయంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు మెట్రో: ఓపెన్ బ్రెయిన్స్ ఒంగోలు శాఖ వారి ఆధ్వర్యంలో పద్మభూషణ్ పవని పరమేశ్వరరావు జయంతి వేడుకలను ఆదివారం స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర శుభప్రదం కమ్యూనిటీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పవని పరమేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగు, పెన్నులు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఓపెన్ బ్రెయిన్ ఒంగోలు శాఖ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై ఏడో తారీఖు పవని పరమేశ్వరరావు జయంతి సందర్భంగా విద్యార్థులకు సంస్థ తరఫున చదువుకునే వస్తువులను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు.

వైఎస్సార్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి

చీమకుర్తి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని సోమవారం సంతనూతలపాడులో నిర్వహించే కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ జెండాల ఆవిష్కరణ


ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

చీమకుర్తి: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ జెండాలు ఆవిష్కరించారు. చీమకుర్తి, కేవీ పాలెం, ఏలూరివారిపాలెం, పల్లామల్లి, దేవరపాలెంతో పాటు పలు గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాలలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతా ఏసుదాస్, పాటిబండ్ల జక్రయ్య, ప్రభుదాస్, నాగభూషణం, స్థానికులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి


కొనకనమిట్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొనకనమిట్ల: ప్రతి వాహనదారుడు, టూ వీలర్స్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్ఐ కె.మాధవరావు వాహనదారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి పత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు మెట్రో: అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ సభ్యులు ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర టెక్నికల్ ఇన్‌చార్జ్ డాక్టర్ లంకా ప్రసన్న కుమార్, జిల్లా అధ్యక్షుడు రామరాజు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఈ నెల కడప జిల్లా గండి క్షేత్రంలో జరగనున్న విద్యుత్ సభలు, శ్రీగురు పురస్కారాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏబీబీఎం కార్యవర్గ సభ్యులు, బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీ రోడ్డులో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆషాడ మాసం ఆదివారం నుంచి ఈ నెల 17వ తేదీ బుధవారం వరకు ప్రతి రోజూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ప్రతిరోజూ విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా, భగవద్గీత, ముకుందమాల, గోవింద నామాలు, శ్రీ వెంకటేశ్వరస్వామికి విశేష అష్టోత్తర నామావళి పారాయణ జరుగుతాయని చెప్పారు. స్థానిక భక్తులు దేవస్థానానికి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.


విష్ణుసహస్రనామ పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

తిరుమలనాథ స్వామికి పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలో రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం శ్రీ గొట్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు ఆలయం ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథ స్వామి

శాకాంబరిగా కోట సత్యమాంబదేవి


బేస్తవారిపేట: శాకాంబరిదేవిగా కోటసత్యమాంబదేవి


బేస్తవారిపేట: శాకాంబరుడిగా సత్యమణికంఠేశ్వరుడు


మార్కాపురం : భక్తులకు దర్శనమిస్తున్న ముద్దసానమ్మ అమ్మవారు


మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా వర్షాలు పడి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని శాకాంబరిదేవిగా, సత్యమణికంఠేశ్వర స్వామిని శాకాంబరుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమబండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ముద్దసానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో వెలసిన ముద్దసానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. ఆదివారం ముద్దసానమ్మకు మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని తమ కష్టాలు తీర్చాలని అమ్మవారిని వేడుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంత ప్రజల గ్రామ ఇలవేల్పు అయిన అల్లూరి పోలేరమ్మ తల్లిని ఆదివారం సందర్భంగా భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించి అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ బండ్లతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య శిలలు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

భక్తుల కోర్కెలు తీర్చే దైవం సాయిబాబా

మార్కాపురం: నమ్ముకున్న భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ప్రత్యక్ష దైవం షిరిడీసాయి బాబా అని గుంటూరు ఆర్అండ్‌బీ ఈఈ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం అన్నారు. మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు చేస్తున్న ప్రవచనాల్లో ఆదివారం మూడో రోజు ఆయన మాట్లాడుతూ బాబా అతి నిరాడంబర జీవితం గడిపారని అన్నారు. బాబా భిక్షాటన చేసి వచ్చిన ఆహారంతో తాను, వచ్చిన భక్తులు, జంతువులు, పక్షులకు అందించేవారని తెలిపారు. భక్తుల బాధలను తన బాధలుగా తీసుకొని బాబా వారిని ఆదరించారని అన్నారు మందిరం అధ్యక్ష, కోశాధికారులు గోపాలుని హరిహరరావు, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామడుగు గోపి, కోశాధికారి నాగరాజు, అదనపు కార్యదర్శి పవన్, గోపిశెట్టి కొండయ్య, కమిటీ సభ్యులు సూరె నాగేశ్వరరావు, విజయ్, కృష్ణమోహన్, రమణారెడ్డి, మధు, వెంకటేశ్వరరెడ్డి, కరీమ్, మోహన్, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న నిర్వాహకులు

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి


ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

యర్రగొండపాలెం: మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలు ఆయా రంగాలలో అభివృద్ధి సాధించాలని సంపూర్ణత అభియాన్ పరిశీలకుడు ప్రదీప్ అన్నారు. శనివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్తిగా వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, అన్ని శాఖలకు చెందిన అధికారులు మండలాన్ని అభివృద్ధి దిశలో నడపాలని కోరారు. ముందుగా మండల రెవెన్యూ కార్యాలయం నుంచి అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు ప్రతిభను చాటారు. ఆరోగ్య, ఐసీడీఎస్, వ్యవసాయం, గిరిజన, డీఆర్‌డీఏ శాఖల స్టాళ్లను ప్రదర్శనకు ఉంచారు. సీఈవో మాధురి, డీఎంహెచ్‌వో సురేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, డీపీఎం సుభాషిణి, డీఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఈవోపీఆర్డీ రాజశేఖరరెడ్డి, సీడీపీవో పద్మావతి, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఏవోలు శేషారెడ్డి, సుచరిత్ర, సుమతి పాల్గొన్నారు.